ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్మార్ట్ ఎడిషన్ Evening 6PM

సంపుటి (Volume): 1 ✦ సంచిక (Issue): 44 ✦ Published From: నంద్యాల (Nandyal) ✦ పేజీలు : 3 ✦ https:www.prajarepublic.com ✦ వెల - 1/- | బుధవారం 18 సెప్టెంబర్ 2024

RNI No: APTEL/2023/87888 | Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

## సీఎంతో మరోసారి చర్చలు కావాలి :బెంగాల్ వైద్యుల డిమాండ్

**జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటనను నిరసిస్తున్న వైద్యులు.. మరోసారి సీఎం మమతా బెనర్జీతో సమావేశం ఏర్పాటుచేయాలని డిమాండ్ చేస్తున్నారు.**



కోల్‌కతా, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 18: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటన ప్రకంపనలు సృష్టిస్తోంది. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో చర్చలు జరిపిన వైద్యులు తమ నిరసనలు ఇంకా కొనసాగిస్తూనే ఉన్నారు. మరికొన్ని డిమాండ్లను వినిపించేందుకు సీఎంతో మరోసారి సమావేశం ఏర్పాటుచేయాలని కోరారు. బాధితురాలికి పూర్తిగా న్యాయం జరిగేంతవరకు తమ నిరసనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఆరోగ్య కార్యదర్శిని తొలగించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఉదయం నుంచి రాష్ట్ర ఆరోగ్యశాఖ ప్రధాన కార్యాలయం ఎదుట నిరసలు కొనసాగిస్తున్నారు. "మా డిమాండ్లు పూర్తిగా నెరవేరేంతవరకు ఈ నిరసనలు కొనసాగుతూనే ఉంటాయి. కోల్కతా ఆరోగ్యశాఖ కార్యదర్శి ఎన్ఎస్ నిగమ్ను విధుల నుంచి తొలగించాలి. అంతేకాక ప్రభుత్వ ఆస్పత్రుల్లో సురక్షిత వాతావరణం కల్పించాలి. ఆరోగ్య వ్యవస్థను పునర్నిర్మించడం అత్యవసరం. మరికొన్ని డిమాండ్లను వినిపించేందుకు సీఎంతో మరోసారి చర్చలు జరపాల్సిన అవసరం ఉంది" అని వైద్యులు తెలిపారు. సీఎం మమతాతో మరో సమావేశాన్ని ఏర్పాటుచేయాలని కోరతూ చీఫ్ సెక్రటరీ మనోజ్ పంత్కు మెయిల్ పంపినట్లు వెల్లడించారు. ఆస్పత్రి ప్రాంగణంలో వైద్యులకు కల్పించే భద్రతతో పాటు ప్రభుత్వం కేటాయించిన రూ.100 కోట్లను ఎలా ఖర్చు చేయాలనుకుంటున్నారనే అంశాలపై సమగ్రంగా చర్చించాలని పేర్కొన్నారు. కాగా.. జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటన రాజకీయాలను కుదిపేస్తోంది. ఈ ఘటనను నిరసిస్తూ ఆందోళన చేస్తున్న వైద్యులతో రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చర్చలు జరిపిన సంగతి తెలిసిందే. వైద్య విద్యార్థుల ఐదు డిమాండ్లలో మూడింటిని దీదీ అంగీకరించారు. ఆందోళనకారుల డిమాండ్ మేరకు కోల్కతా నగర పోలీస్ కమిషనర్ వినీత్ గోయల్పై వేటు పడింది. ఈ క్రమంలోనే నూతన కమిషనర్గా మనోజ్ కుమార్ వర్మను నియమిస్తూ దీదీ సర్కారు నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలోనే మరికొన్ని డిమాండ్లను వినిపించేందుకు మరోసారి సీఎంతో సమావేశం ఏర్పాటుచేయాలని నిరసనకారులు అభ్యర్థిస్తున్నారు.

## నూతన మద్యం విధానానికి ఏపీ కేబినెట్ ఆమోదం

**ఏపీ మంత్రివర్గ సమావేశం ముగిసింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన సుదీర్ఘంగా సాగిన ఈ భేటీలో నూతన మద్యం విధానానికి కేబినెట్ ఆమోదం తెలిపింది.**



అమరావతి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 18: ఏపీ మంత్రివర్గ సమావేశం ముగిసింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన సుదీర్ఘంగా సాగిన ఈ భేటీలో నూతన మద్యం విధానానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. నాణ్యమైన మద్యం బ్రాండ్లు అందుబాటులో ఉంచాలని నిర్ణయించింది. సగటు మద్యం ధర రూ.99 నుంచి అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు. భోగాపురం విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు విమానాశ్రయంగా నామకరణం చేస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. వాలంటీర్ల వ్యవస్థపై ఈ సమావేశంలో సుదీర్ఘ చర్చ జరిగింది.

## విద్యార్థుల్లో స్కిల్ అప్డేషన్ చేసేందుకు కృషి: రేవంత్ రెడ్డి

**ప్రతి విద్యార్థికీ ఉపాధి కల్పించే విధంగా పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఎంఎస్ఎంఈ నూతన పాలసీని సీఎం విడుదల చేశారు.**



హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 18: ప్రతి విద్యార్థికీ ఉపాధి కల్పించే విధంగా పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఎంఎస్ఎంఈ నూతన పాలసీని సీఎం విడుదల చేశారు. తాము చేసే ప్రతి ప్రయత్నమూ రాష్ట్ర భవిష్యత్తు కోసమేనని స్పష్టం చేశారు. యువతకు వ్యవసాయం, పరిశ్రమల్లో పెట్టుబడి పెట్టేందుకు తగిన చేయూతనిస్తామని వెల్లడించారు. వ్యవసాయ రంగంలో యువత ఎదిగేవిధంగా ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. "దేశ ఆర్థిక పరిస్థితి దెబ్బతిన్నప్పుడు పీవీ నరసింహారావు కృషిని మనం జ్ఞాపకం చేసుకోవాలి. ప్రపంచంతో పోటీపడేలా పీవీ ఆర్థిక విధానాలు తీసుకొచ్చారు. విధానాల రూపకల్పనలు లేకుండా రాష్ట్రం అభివృద్ధి చెందదు. రాష్ట్రంలోని విద్యార్థుల్లో స్కిల్ అప్డేషన్ చేయడానికి కృషి చేస్తున్నాం. పరిశ్రమలకు గత ప్రభుత్వం ఇచ్చిన సబ్సిడీలను చెల్లిస్తాం. కొవిడ్ వ్యాక్సిన్ తయారీలో కూడా మనం రాష్ట్రం ముందుంది. ఐటీ, ఫార్మా అభివృద్ధికి కాంగ్రెస్ ఎంతో కృషి చేసింది. రాష్ట్రంలో ప్రతి ఏడాది లక్షల మంది ఇంజినీరింగ్ విద్యార్థులు బయటకు వస్తున్నారు. ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించేలా పరిశ్రమలను ప్రోత్సహిస్తాం. వ్యవసాయం అనేది దండగ కాదు.. పండగ అనేది మా ప్రభుత్వ నినాదం. రూ.18వేల కోట్ల నిధులు విడుదల చేసి రైతుల రుణాలు తీర్చాము. తెలంగాణ రాష్ట్రం వడ్డించిన విస్తరాకును తలపిస్తోంది. పరిశ్రమలకు అవసరమైన భూమి, నీరు, ఆర్థిక సాయం అందిస్తాం. మూసీ నది వీక్షణకు పర్యటకులు ఇతర దేశాల నుంచి వచ్చేలా అభివృద్ధి చేస్తాం. దళితులు, గిరిజనలు, మహిళలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం బాగుపడినట్లు. ప్రభుత్వ పాఠశాలలను కూడా ఎంతో మెరుగుపరుస్తున్నాం" అని వెల్లడించారు.

## అధికార నివాసాన్ని వీడనున్న కేజ్రీవాల్.. ఆయన భద్రతపై ఆప్ ఆందోళన

**దిల్లీ సీఎం పదవికి రాజీనామా చేసిన అరవింద్ కేజ్రీవాల్.. వారం రోజుల్లో అధికార నివాసాన్ని ఖాళీ చేయనున్నారు. ఆయన భద్రతపై ఆప్ ఆందోళన వ్యక్తం చేస్తోంది.**



దిల్లీ, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 18: ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఆయన అధికార నివాసాన్ని ఖాళీ చేయనున్నారు. ఇంటితో పాటు అన్నిరకాల సౌకర్యాలను వదులుకునేందుకు సిద్ధమయ్యారని ఆప్ ఎంపీ సంజయ్సింగ్ వెల్లడించారు. దీంతో ఆయన భద్రతపై పార్టీ నేతలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. "వారం రోజుల్లోగా కేజ్రీవాల్ అధికార నివాసాన్ని ఖాళీ చేయనున్నారు. అంతేకాకుండా.. ప్రభుత్వం కల్పించిన అన్నిరకాల వసతులను వదులుకునేందుకు ఆయన సిద్ధమయ్యారు. కొత్త ఇంటి కోసం అన్వేషణ జరుగుతోంది. కేజ్రీవాల్ ప్రజల మనిషి. ఆయన ఢిల్లీవాసులతో కలిసి జీవించాలని అనుకుంటున్నారు. ప్రస్తుతం ఉంటున్న నివాసం ఆయనకు సరైన భద్రత కల్పిస్తోంది. ఇప్పుడు ఆయన బయటకు రాబోతున్నారు. కేజీవాల్ భద్రతపై మేమంతా ఆందోళన చెందుతున్నాం" అని సంజయ్సింగ్ పేర్కొన్నారు. కేంద్రంలోని మోదీ సర్కార్ పై ఆప్ నేత విమర్శల బాణాలు ఎక్కుపెట్టారు. కేజ్రీవాల్ రాజీనామాపై దిల్లీ ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఆయన రాజీనామా చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నిస్తున్నారు. ఆయన అవినీతిపరుడంటూ పరువు తీసేందుకు భాజపా రెండేళ్లుగా ప్రయత్నిస్తోంది. తప్పుడు ఆరోపణలతో కేజీవాల్ను జైలుకు పంపింది" అని ఆరోపించారు. కాగా.. దిల్లీ మద్యం విధానం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై సీఎం కేజ్రీవాల్ అరెస్టయిన విషయం తెలిసిందే. ఇటీవల తిహాడ్ జైలు నుంచి విడుదలైన ఆయన సీఎం పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించారు. దీంతో ఆప్ నేతలంతా దిల్లీ మంత్రి ఆతిశీని సీఎంగా ఎన్నుకున్నారు. ఈక్రమంలోనే లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాకు కేజ్రీవాల్ తన రాజీనామా లేఖను అందజేశారు. పదవి నుంచి వైదొలగడంతో అధికార నివాసాన్ని ఖాళీ చేయనున్నారు. కొత్త నివాసం కోసం ఆయన కుటుంబసభ్యులు వెతుకుతున్నట్లు తెలుస్తోంది. కేజ్రీవాల్ భద్రతపై ఆప్ ఆందోళన వ్యక్తం చేస్తోంది.

## వన్ ట్రిలియన్ ఎకానమీనే సీఎం సంకల్పం: మంత్రి శ్రీధర్ బాబు

**తెలంగాణ ఆవిర్భావం తర్వాత తొలిసారి ఎంఎస్ఎంఈల పాలసీని విడుదల చేసినట్లు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఎంఎస్ఎంఈల పాలసీ విడుదల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.**



హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 18: తెలంగాణ ఆవిర్భావం తర్వాత తొలిసారి ఎంఎస్ఎంఈల పాలసీని విడుదల చేసినట్లు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఎంఎస్ఎంఈల పాలసీ విడుదల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. "రాబోయే కాలంలో ఎంఎస్ఎంఈల్లో సాంకేతికతను వాడుకోవాలి. ఎంఎస్ఎంఈలను కాపాడుకోవాలని రాహుల్ గాంధీ కోరారు. ఎక్కువ స్థాయిలో ఉపాధి కల్పిస్తున్న రంగం ఎంఎస్ఎంఈలు. ఈ పరిశ్రమలకు చెందిన 120 మంది ప్రముఖుల నుంచి సలహాలు, సూచనలు తీసుకున్నాం. హైదరాబాద్ తోపాటు ఇతర జిల్లాలు సమానంగా అభివృద్ధి చెందాలన్నదే మా ప్రభుత్వ విధానం. మన రాష్ట్రం వన్ ట్రిలియన్ ఎకానమీ చేరుకోవాలని సీఎం సంకల్పించారు. పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేస్తాం. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మౌలిక వసతులతో ప్లాట్ ఫ్యాక్టరీస్ ఏర్పాటు చేస్తాం. కొత్తగా క్లస్టర్లను ఏర్పాటు చేస్తున్నాం. కేంద్రం నుంచి ఆర్థిక సాయం పొందేందుకు సాంప్రదాయ, ప్రత్యామ్నాయం మార్గాలు చూశాం. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఆర్థిక పురోభివృద్ధిలో ఎంతో కీలక పాత్ర పోషిస్తాయి. రాష్ట్రం నుంచి అంతర్జాతీయ స్థాయిలో ఎగుమతులు జరిగేలా అందుబాటులోకి తీసుకొచ్చాం" అని తెలిపారు.

### రాహుల్ ఆలోచనతోనే కొత్త పాలసీ: భట్టి

"రాహుల్ గాంధీ ఆలోచనలతోనే ఎంఎస్ఎంఈ నూతన పాలసీ తీసుకొచ్చాం. చాలా రాష్ట్రాల్లో ఎంఎస్ఎంఈలు మూతపడ్డాయి. ఇక్కడ ఇతర రాష్ట్రాలకు విభిన్నంగా రూపొందించారు. ఎంఎస్ఎంఈ పాలసీ రూపొందించిన శ్రీధర్ బాబుకు ధన్యవాదాలు. ఆర్థిక వ్యవస్థ పటిష్ఠత కోసం ఎంఎస్ఎలు కీలకం. దేశ జీడీపీకి, రాష్ట్ర జీడీపీకి ఎంఎస్ఎంఈ ఎంతో తోడ్పడుతుంది. దాదాపు రూ.80వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు బహుళ జాతి కంపెనీలు ముందుకు వచ్చాయి. భారీ పరిశ్రమలకు ఎంఎస్ఎంఈల నుంచి పలు ఉత్పత్తులు ఎగుమతి అవుతాయి" అని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు.

## రాహుల్ గాంధీ హత్యకు కుట్ర జరుగుతోంది : అజయ్ మాకెన్

**కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హత్యకు కుట్ర జరుగుతోందని కాంగ్రెస్ నేతలు కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు.**



దిల్లీ, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 18: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హత్యకు కుట్ర జరుగుతోందని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. ఈమేరకు పలువురు భాజపా నేతలపై బుధవారం ఢిల్లీలోని తుగ్లక్ రోడ్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అజయ్ మాకెన్ ఫిర్యాదు ప్రతిని కేంద్ర ఎన్నికల సంఘానికి పంపారు. "రాహుల్ గాంధీని ఉగ్రవాది అని సంభోదిస్తూ పలువురు ఎన్డీఏ నేతలు వారి మిత్రపక్షాలు ఆయనపై దాడి చేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారు. రాహుల్ పేదలు, దళితులు, మహిళలు, విద్యార్థుల సమస్యలపై కేంద్రాన్ని నిరంతరం ప్రశ్నిస్తున్నారు. వారి సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారు. ఇది భాజపాకు, దాని మిత్రవర్గాలకు నచ్చడం లేదు. అందుకే వారు రాహుల్పై ఇటువంటి విద్వేషపూరిత వ్యాఖ్యలు చేస్తున్నారు. ప్రజల్లో అశాంతి నెలకొనేలా చేయడానికి కుట్రలు పన్నుతున్నారు" అని ఫిర్యాదులో పేర్కొన్నారు. సెప్టెంబరు 11న రాహుల్పై బహిరంగ బెదిరింపులకు పాల్పడిన భాపా నేత తర్విందర్ సింగ్ మార్వా, రైల్వేశాఖ సహాయ మంత్రి రవ్నీత్ బిట్టు. శివసేన ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్ పేర్లను ఫిర్యాదులో పేర్కొన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నాలుకను ఎవరైనా కోసేస్తే వారికి రూ.11 లక్షల రివార్డు అందిస్తానంటూ ఇటీవల మహారాష్ట్రలోని బుల్దానా నియోజకవర్గ శివసేన ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. భారత్లో రిజర్వేషన్ల వ్యవస్థను తొలగించాలనే ఆలోచనలో ఉన్నట్లు విదేశీ పర్యటనలో ఉండగా రాహుల్ వ్యాఖ్యానించారని, దీన్నిబట్టి కాంగ్రెస్ అసలు రూపం బయటపడిందని గైక్వాడ్ విమర్శించారు. గైక్వాడ్ వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ ఖండించింది. మనసంతా ద్వేషం నిండిన సేవకులే అటువంటి వ్యాఖ్యలు చేస్తారని, వారే నిజమైన ఉగ్రవాదులని అభివర్ణించింది. దీంతో రాహుల్ గాంధీపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసినందుకు అతడిపై కేసు నమోదైంది. కాంగ్రెస్ శ్రేణుల ఫిర్యాదుతో బుల్దానా నగర పోలీస్ స్టేషన్ లో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

## ప్రజలకు జవాబుదారీగా పనిచేసేందుకు సిద్ధం: డీజీపీ

**ప్రజలకు జవాబుదారీగా పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఏపీ డీజీపీ ద్వారకా తిరుమల రావు తెలిపారు.**

ఏలూరు, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 18: ప్రజలకు జవాబుదారీగా పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఏపీ డీజీపీ ద్వారకా తిరుమల రావు తెలిపారు. ఏలూరులో మీడియాతో ఆయన మాట్లాడారు. పోలీసుశాఖలో మౌలిక వసతులు పెంచేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. పోలీసులు ధైర్యంగా పనిచేసేలా సంసిద్ధం చేస్తున్నామని చెప్పారు. "పోలీసుల సంక్షేమం కోసం కొన్ని కార్యక్రమాలు చేపట్టాం. పోలీస్ క్యాంటీన్ల వర్కింగ్ క్యాపిటల్ కింద రూ.4.7 కోట్లు ఇచ్చాం. ఎన్హెచ్ఓలకు ఇన్వెస్టిగేషన్ ఛార్జీలు రాలేదని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే మా లక్ష్యం. లైంగిక దాడులను నివారించేందుకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ముంబయి నటి కేసులో ప్రాథమిక విచారణ పూర్తయింది. ఇంకా లోతైన విచారణ జరగాల్సి ఉంది"అని డీజీపీ తెలిపారు.



printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501
EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# ఏపీలోనూ హైడ్రాను ఏర్పాటు చేయాలి: నారాయణ

విజయవాడలో సంభవించిన భారీ వర్షాలు, వరదలను కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు.



విజయవాడ, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 18: నగరంలో సంభవించిన భారీ వర్షాలు, వరదలను కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సీపీఐ నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. పాత రాజరాజేశ్వరిపేటలో వరద బాధితులకు చీరలు, దుప్పట్లు, టవల్స్ పంపిణీ చేశారు. ప్రభుత్వం బుడమేరును యుద్ధ ప్రాతిపదికన ఆధునీకరించాలని నారాయణ డిమాండ్ చేశారు. వరదల కారణంగా ముంపునకు గురైన ప్రాంతాల్లో ప్రజలు సర్వం కోల్పోయారని వివరించారు. కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించేలా ప్రధాని మోదీపై సీఎం చంద్రబాబు ఒత్తిడి తీసుకురావాలన్నారు. జాతీయ విపత్తు ప్రత్యేక నిధి ఏర్పాటు చేసి రూ.10వేల కోట్లను కేటాయించాలని.. విపత్తులు సంభవించినప్పుడు ఆ నిధులు వాడుకోవచ్చని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వరద ప్రభావిత ప్రాంతాల్లో రాత్రింబవళ్లు తిరిగి బాధితులకు సహాయక చర్యలు చేపట్టడం సంతోషకరమన్నారు. వరద బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సాయం పెంచాలని.. వరదల కారణంగా నష్టపోయిన విద్యార్థులకు ప్రత్యేకంగా సాయం అందించాలని కోరారు. తెలంగాణలో తరహా ఏపీలో కూడా హైడ్రాను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి సూచించారు.

# భార్యాభర్తల మధ్య గొడవ.. భర్త గుండెలపై కత్తెరతో పొడిచిన భార్య

భార్యాభర్తల మధ్య వివాదం చిలికి చిలికి గాలివానై భర్త హత్యకు దారితీసింది. ఈ ఘటన తూర్పుగోదావరి జిల్లాలో జరిగింది.



నిడదవోలు, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 18: భార్యాభర్తల మధ్య వివాదం చిలికి చిలికి గాలివానై భర్త హత్యకు దారితీసింది. ఈ ఘటన తూర్పుగోదావరి జిల్లాలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలంలోని రెడ్డి చెరువు గ్రామానికి చెందిన చింతలపూడి శ్రీనివాసరావు, రాణి దంపతుల మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మంగళవారం రాత్రి వారిద్దరి మధ్య గొడవ జరిగింది. ఆ సమయంలో రాణి తన భర్త శ్రీనివాసరావు గుండెలపై కత్తెరతో పొడిచింది. తీవ్రంగా గాయపడిన శ్రీనివాసరావును అతని తమ్ముడు తణుకులోని జిల్లా కేంద్రాసుపత్రికి తరలించాడు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీనివాసరావు మృతి చెందాడు. మృతుడి అన్న గోవిందరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉండ్రాజవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఐపీసీ 302 సెక్షన్ కింద కేసు నమోదు చేశామని, నిందితురాలిని అరెస్ట్ చేస్తామని సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

# జవాన్ల మధ్య వివాదం.. ఒకరి మృతి.. మరో ముగ్గురికి తీవ్ర గాయాలు

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బలరాంపూర్ జిల్లాలోని ఓ పోలీస్ క్యాంపులో కొందరు జవాన్ల మధ్య వివాదం చోటుచేసుకుంది.



భద్రాచలం, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 18: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బలరాంపూర్ జిల్లాలోని ఓ పోలీస్ క్యాంపులో కొందరు జవాన్ల మధ్య వివాదం చోటుచేసుకుంది. బూతాహీ పోలీస్ క్యాంప్ లో సీఏఎఫ్ ఛత్తీస్గఢ్ ఆర్మ్డ్ ఫోర్స్కు చెందిన ఓ జవాన్ తన తోటి జవాన్లపై కాల్పులు జరిపాడు. ఈ కాల్పుల్లో ఓ జవాన్ అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. అయితే కాల్పులకు గల కారణాలుఇంకా తెలియరాలేదు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన జవాన్లను అంబులెన్స్లో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ సమాచారం అందుకున్న ఎస్పీ రాజేష్ అగర్వాల్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు.

## తెదేపాలో చేరిన ప.గో జిల్లా జడ్పీ ఛైర్పర్సన్

అమరావతి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 18: పశ్చిమ గోదావరి జిల్లా జడ్పీ ఛైర్పర్సన్ గంటా పద్మశ్రీ తెదేపాలో చేరారు. మంత్రి నారా లోకేశ్ సమక్షంలో ఆమె ఆ పార్టీలో చేరారు. పద్మశ్రీతోపాటు పలువురు వైకాపా నేతలు కూడా తెదేపా తీర్థం పుచ్చుకున్నారు.

# తెలుగు రాష్ట్రాలకు యువ ట్రైనీ ఐపీఎస్ల కేటాయింపు..

తెలుగు రాష్ట్రాలకు యువ ట్రైనీ ఐపీఎస్లను కేటాయిస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది.

హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 18: తెలుగు రాష్ట్రాలకు యువ ట్రైనీ ఐపీఎస్లను కేటాయిస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది.

**ఆంధ్రప్రదేశ్ కేటాయించిన యువ ట్రైనీ ఐపీఎస్ల జాబితా..**

- హరియాణాకు చెందిన దీక్ష
- ఏపీకి చెందిన బొడ్డు హేమంత్
- ఏపీకి చెందిన మనీషా వంగల రెడ్డి
- తమిళనాడుకు చెందిన సుష్మిత

**తెలంగాణకు కేటాయించిన జాబితా..**

- జమ్మూకశ్మీర్ కు చెందిన మనన్ భట్
- తెలంగాణకు చెందిన రుత్విక్ సాయి కొట్టే
- తెలంగాణకు చెందిన సాయి కిరణ్.
- ఉత్తర్ ప్రదేశ్కు చెందిన యాదవ్ వసుంధర

# జానీమాస్టర్ లైంగిక వేధింపుల ఘటన తీవ్రమైన చర్య: భాజపా

తెలుగు చిత్రసీమలో అసిస్టెంట్ కొరియోగ్రాఫర్గా పనిచేస్తున్న ఓ యువతిపై లైంగిక వేదింపుల ఘటనను తీవ్రమైన చర్యగా భావిస్తున్నామని భాజపా మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి అన్నారు.

హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 18: తెలుగు చిత్రసీమలో అసిస్టెంట్ కొరియోగ్రాఫర్గా పనిచేస్తున్న ఓ యువతిపై జానీ మాస్టర్ లైంగిక వేధింపుల ఘటనను తీవ్రమైన చర్యగా భావిస్తున్నామని భాజపా మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి అన్నారు. ఆ యువతిపై ఐదేళ్లపాటు నరకం చూపించడంతోపాటు వేధింపులు, దాడులకు పాల్పడటం, మతం మారాలంటూ ఒత్తిళ్లకు గురిచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ఇది లవ్ జిహాద్ కేసుగా శిల్పారెడ్డి పేర్కొన్నారు. హిందూ అమ్మాయిని ట్రాప్ చేసినట్లుగా ఎఫ్ఎఆర్ నమోదు చేసినప్పటికీ కేసును నీరుగార్చేందుకు నిందితుడిపై పనికిరాని కేసులు పెట్టడమేంటని ప్రశ్నించారు. ఇంతవరకు నిందితుడిని అరెస్టు చేయకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. ఈ ఘటనకు కొందరు సినీ ఇండస్ట్రీ పెద్దలతోపాటు అధికార పార్టీ నాయకుల అండదండలు ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే మహిళలపై అత్యాచారాలు, హిందూ మహిళలను మతం మార్చి లైంగికంగా వేధించే ఘటనలు తీవ్రమైనా.. రాష్ట్ర ప్రభుత్వం చీమకుట్టినట్లు కూడా వ్యవహరించకపోవడం సిగ్గుచేటు అన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని దుయ్యబట్టారు. దీనికి హోంశాఖ నిర్వహిస్తున్న సీఎం రేవంత్రెడ్డి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎన్నో అరాచకాలు, అఘాయిత్యాలు జరుగుతున్నా.. హోంశాఖపై ఒక్కసారి కూడా సమీక్షించలేకపోవడంతో శాంతిభద్రతల పరిస్థితి మరింత దిగజారిందని విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసును తీవ్రంగా పరిగణించి, చట్టపరంగా పారదర్శకంగా విచారణను జరిపించేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో భాజపా మహిళా మోర్చా ఆధ్వర్యంలో బాధిత మహిళలకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని శిల్పా రెడ్డి హెచ్చరించారు.



# పోలవరం స్పెషల్ కలెక్టర్ మురళిపై క్రమశిక్షణ చర్యలు

పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు గతంలో స్పెషల్ కలెక్టర్గా పనిచేసిన మురళిపై ప్రభుత్వం క్రమశిక్షణ చర్యలు తీసుకుంది.



అమరావతి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 18: పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు గతంలో స్పెషల్ కలెక్టర్గా పని చేసిన మురళీపై ప్రభుత్వం క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. అక్రమ చెల్లింపులపై నమోదైన అభియోగాలకు 10 రోజుల్లో రాతపూర్వక సమాధానం ఇవ్వాలంటూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన చేసిన అక్రమ చెల్లింపుల కారణంగా రాష్ట్ర ఖజానాకు రూ.19.52 కోట్లు నష్టం వాటిల్లినట్లు అభియోగాల్లో పేర్కొంది. ఈమేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు.

# మద్యం మత్తులో యువకుల ఘర్షణ.. ఇద్దరు వ్యక్తులపై కత్తులతో దాడి

మద్యం మత్తులో యువకుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో ఇద్దరు వ్యక్తులపై పలువురు కత్తులతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన మేడ్చల్ పీఎస్ పరిధిలోని కిష్టాపూర్లో జరిగింది.

హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 18: మద్యం మత్తులో యువకుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో ఇద్దరు వ్యక్తులపై కొందరు కత్తులతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన మేడ్చల్ పీఎస్ పరిధిలోని కిష్టాపూర్లో జరిగింది. కొన్నిరోజుల క్రితం పవన్ అనే వ్యక్తి బిహార్ నుంచి సీడ్ వ్యాపారం నిమిత్తం మేడ్చల్ జిల్లా కిష్టాపూర్ సమీపంలోని సాయినగర్ కాలనీకి వచ్చి నివాసం ఉంటున్నాడు. బుధవారం తెల్లవారుజామున పవన్, తన స్నేహితుడితో కలిసి.. తాను నివాసం ఉంటున్న ఇంటికి ఎదురుగా కూర్చుని మద్యం తాగుతున్నాడు. ఆ సమయంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు పవన్ ఇంటికి వచ్చి కత్తులతో దాడి చేసి ఇద్దరి గొంతు కోసి, అక్కడినుంచి పరారయ్యారు. ఈ దాడిలో పవన్ తీవ్రంగా గాయపడగా.. సంతోష్ పరిస్థితి విషమంగా ఉంది. దీన్ని గమనించిన స్థానికులు క్షతగాత్రులను ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు మేడ్చల్ పోలీసులు తెలిపారు.



# వైకాపాకు మరో షాక్.. బాలినేని రాజీనామా

వైకాపాకు మరో షాక్ తగిలింది. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేశారు.



అమరావతి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 18: వైకాపాకు మరో షాక్ తగిలింది. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను పార్టీ అధ్యక్షుడు జగన్కు పంపారు. జగన్ విధానాలు నచ్చకే రాజీనామా చేస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు.

# జమిలి ఎన్నికలకు కేంద్ర కేబినెట్ ఆమోదం

దేశంలో జమిలి ఎన్నికలకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది.

దిల్లీ, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 18: దేశంలో జమిలి ఎన్నికలకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికల నిర్వహణకు సంబంధించి మాజీ రాష్ట్రపతి రామ్నాథ్ కోవింద్ రూపొందించిన నివేదికను మంత్రివర్గం ఆమోదించింది. వచ్చే పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెట్టే అవకాశాలున్నాయి. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు, హైకోర్టు న్యాయమూర్తులతో సహా 32 పార్టీలు ప్రముఖ న్యాయమూర్తులు దీనిని సమర్థించారు. 18 రాజ్యాంగ సవరణలను ప్యానల్ సిఫార్సు చేసింది. అదేవిధంగా చంద్రయాన్- 4కు, గగన్యాన్, చంద్రయాన్ విస్తరణకు కేబినెట్ ఆమోదం తెలిపింది. “ఒక దేశం, ఒకే ఎన్నికలు” విధానాన్ని అమలు చేయడం ద్వారా ఎన్నికల ప్రక్రియ సులభతరం అవుతుందని, తద్వారా వేగవంతమైన ఆర్థికవృద్ధికి దారితీస్తుందని ప్యానల్ పేర్కొంది. లోక్సభ, రాష్ట్ర అసెంబ్లీ, పంచాయతీలకు మూడు స్థాయిల్లో ఎన్నికలు నిర్వహించడం వల్ల వలస కార్మికులు పలుమార్లు ఓటేయడం కోసం సెలవులపై తమ ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని.. దీనివల్ల ఉత్పత్తిలో అంతరాయం కలుగుతుందని వెల్లడించింది. దానిని నివారించాలంటే జమిలి ఎన్నికలే ఏకైక పరిష్కారమని పేర్కొంది. ప్రస్తుత ఎన్డీయే సర్కారు హయాంలోనే జమిలి ఎన్నికలు అమలుచేసి చూపుతామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇటీవల స్పష్టంచేశారు. గతనెల స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రధాని మోదీ ఎర్రకోట నుంచి ప్రసంగిస్తూ జమిలి ఎన్నికల గురించి ప్రస్తావించారు. దేశవ్యాప్తంగా ఏటా ఏదో ఒక రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతున్నాయని, వీటి ప్రభావం దేశ పురోగతిపై పడుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. దీనినుంచి బయటపడాలంటే జమిలి ఎన్నికలే పరిష్కారమని అన్నారు. ఈ దిశగా అన్ని రాష్ట్రాలు ముందుకురావాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ఎన్డీఏ 3.0 సర్కారులోనే జమిలి ఎన్నికలు అమల్లోకి వస్తాయని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.

## ఈ ఆమోదం.. ఆచరణాత్మకం కాదు:మల్లికార్జున్ ఖర్గే



అయితే కాంగ్రెస్ సహా 15 పార్టీలు ఈ విధానాన్ని వ్యతిరేకించాయి. ఈ ప్రతిపాదన ఆచరణాత్మకమైనది కాదని కాంగ్రెస్ పేర్కొంది. పార్టీ అధినేత మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ “ఇది ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం. దీనిని ప్రజలు అంగీకరించరు” అని అన్నారు.

# నెల్లూరు జిల్లాలో మొదటి పంటకు డోకా లేదు : సోమిరెడ్డి

గత సీఎంకు 70 వేలకు, 14 వేలకు తేడా తెలియదని తెదేపా సీనియర్ నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఎద్దేవా చేశారు.



నెల్లూరు, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 18: గత సీఎంకు 70 వేలకు, 14 వేలకు తేడా తెలియదని తెదేపా సీనియర్ నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఎద్దేవా చేశారు. బుడమేరును ప్రక్షాళన చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారని సోమిరెడ్డి తెలిపారు. శ్రీశైలం నుంచి జిల్లాకు 85 టీఎంసీల నీళ్లు వస్తాయన్నారు. నెల్లూరు జిల్లాలో మొదటి పంట డోకా లేకుండా పండించుకోవచ్చని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో 3 లక్షల ఎకరాలు బీడు పెట్టారని విమర్శించారు. గతంలో జిల్లాకు నీళ్లు రాకపోయేసరికి బీడు పెట్టాల్సిన పరిస్థితి ఉండేదన్నారు.

# తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల విడుదల

తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లు విడుదలయ్యాయి.



తిరుమల, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 18: తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లు విడుదలయ్యాయి. డిసెంబర్ నెలకు సంబంధించిన ఆర్జిత దర్శనాల ఆన్లైన్ కోటాను విడుదల చేశారు. ఈ నెల 20న ఉదయం 10 గంటల వరకు నమోదుకు అవకాశం కల్పించారు.

- ఈ నెల 21వ తేదీ ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, ఊంజల్సేవ, సహస్ర దీపాలంకార సేవ టికెట్లను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. వర్చువల్ సేవా టికెట్లను అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేస్తారు.
- 23న ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణ టోకెన్లు, ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు బ్రేక్ దర్శనం కోటా విడుదల చేస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు, దివ్యాంగులకు ఉచిత ప్రత్యేక ప్రవేశ దర్శన టోకెన్ల కోటా విడుదల చేస్తారు.
- 24న ఉదయం 10 గంటలకు డిసెంబరు నెల ప్రత్యేక ప్రవేశ దర్శనం రూ.300 టికెట్లు, మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలో అద్దె గదుల బుకింగ్ కోటా విడుదల చేస్తారు.
- 27న ఉదయం 11 గంటలకు డిసెంబరు నెలకు సంబంధించి తిరుమల, తిరుపతికి చెందిన శ్రీవారి సేవా కోటాను, మధ్యాహ్నం 12 గంటలకు నవనీత సేవ, మధ్యాహ్నం ఒంటి గంటకు పరకామణి సేవా కోటా విడుదల చేస్తారు.

భక్తులు https://ttdevasthanams. ap.gov.in వెబ్సైట్లో సేవా టికెట్లను బుక్ చేసుకోవాలని తితిదే కోరింది.

# కష్టాల్లో ఉన్న ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తాం : మంత్రి లోకేశ్

అమరావతి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 18: ఏపీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు విని పరిష్కరించేందుకే ప్రజా ప్రభుత్వం ఉందని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వం మాదిరిగా పరదాలు కట్టుకుని తిరగడం లేదని, కష్టాల్లో ఉన్న ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. ఉండవల్లిలో మంత్రి నారా లోకేశ్ 32వ రోజు “ప్రజాదర్బార్” నిర్వహించారు. మంగళగిరితో పాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. మంత్రి లోకేశ్ను కలిసి తాము ఎదుర్కొంటున్న సమస్యలను తెలిపారు. ఆయా సమస్యలను సంబంధిత శాఖలకు పంపి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. మహాత్మాగాంధీ పర్యటించిన పల్నాడు జిల్లా వినుకొండ నియోజకవర్గం ఎ.ముప్పాళ్ల గ్రామానికి తాగునీటి సౌకర్యం కల్పించాలని రాపర్ల జగన్నాథం మంత్రిని కలిసి విజ్ఞప్తి చేశారు. కుంచనపల్లి, ప్రాతూరు ప్రాంత రైతులు మంత్రిని కలిశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పొలాలు నీటమునిగి తీవ్రంగా నష్టపోయామని, ఆయిల్ ఇంజిన్లు సైతం నీట మునిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టపరిహారం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన విధంగా సాయం అందిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు.



# చరిత్రలో నేటి ప్రత్యేకత

- 2003: ప్రపంచ నీటి పర్యవేక్షణ దినోత్సవం
- 1752: ఫ్రెంచి గణిత శాస్త్రవేత్త అడ్రియన్ మేరీ లెజెండ్రీ జననం (మ.1833).
- 1783: స్విట్జర్లాండుకు చెందిన గణిత శాస్త్రజ్ఞుడు, భౌతిక శాస్త్రజ్ఞుడు లియొనార్డ్ ఆయిలర్ మరణం (జ.1707).
- 1950: భారత సినిమా నటి షబానా అజ్మీ జననం.
- 1951: భారత పార్లమెంటు సభ్యుడు కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి జననం.
- 1958: భారతీయ తత్వవేత్త, భారతరత్న పురస్కార గ్రహీత భగవాన్ దాస్ మరణం (జ.1869).
- 1976: బ్రెజిల్ ఫుట్‌బాల్ ఆటగాడు రొనాల్డో జననం.
- 1977: వాయోజెర్ 1 ఉపగ్రహం చంద్రుడు, భూమి చిత్రాలను తీసింది..
- 1978: హేతువాది ఎ.టి.కోవూర్ మరణం (జ.1898).
- 1992: భారత ప్రధాన న్యాయమూర్తి.
- తాత్కాలిక రాష్ట్రపతిగా ముప్పై ఐదు రోజులపాటు పనిచేసిన మహమ్మద్ హిదయతుల్లా మరణం (జ.1905).



అడ్రియన్ మేరీ లెజెండ్రీ


లియొనార్డ్ ఆయిలర్



షబానా అజ్మీ


ఎం.ఎఫ్. హుసేన్


ముత్తరాజు సుబ్బారావు


శివరాజు సుబ్బలక్ష్మి


జయరామన్


సీతాకాంత్



గోపాలకృష్ణమూర్తి



## మహేశ్ బాబు లేదా ప్రభాస్.. కరీనాకపూర్ ఏ హీరో చిత్రానికి సైన్ చేశారు..?

**సినీ పరిశ్రమలో దాదాపు 25 ఏళ్లు పూర్తి చేసుకున్నారు నటి కరీనా కపూర్. తాజాగా ఆమె ఓ భారీ ప్రాజెక్ట్ కోసం సైన్ చేసినట్లు వార్తలు వస్తున్నాయి.**

సినీ పరిశ్రమలో దాదాపు 25 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. నటి కరీనా కపూర్. కెరీర్ ఆరంభం నుంచి బాలీవుడ్లో నే ఉన్న ఆమె ప్రస్తుతం దక్షిణాది సినిమాల్లోనూ నటించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ క్రమంలోనే ఆమె ఓ భారీ ప్రాజెక్ట్ కోసం సైన్ చేసినట్లు వార్తలు వస్తున్నాయి. భారతీయ చిత్ర పరిశ్రమలో మునుపెన్నడూ లేనివిధంగా అత్యంత భారీ బడ్జెట్తో తెరకెక్కుతోన్న ఓ ప్రతిష్టాత్మక మూవీలో కరీనాకపూర్ భాగమయ్యారంటూ బీటౌన్లో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఈనేపథ్యంలోనే ప్రభాస్ 'స్పిరిట్', మహేశ్ బాబు, రాజమౌళి ప్రాజెక్టులు తెరపైకి వచ్చాయి. ఆ రెండు చిత్రాల్లో ఒక దాని కోసం ఆమె సైన్ చేశారని టాక్. ప్రభాస్ హీరోగా సందీప్ రెడ్డి వంగా తెరకెక్కించనున్న భారీ ప్రాజెక్ట్ 'స్పిరిట్. సుమారు రూ.500 కోట్ల భారీ బడ్జెట్తో యాక్షన్ డ్రామాగా సిద్ధం కానుంది. ప్రభాస్ తొలిసారి పోలీస్ పాత్రలో అలరించనున్నారు. ఈ ఏడాది చివరిలో ఈ సినిమా షూటింగ్ మొదలుపెట్టే అవకాశం ఉంది. 2026లో విడుదల కానుంది. ప్రస్తుతం దీని ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నట్లు సమాచారం. ఈ సినిమాలో హీరోయిన్గా కరీనాకపూర్ కనిపించనున్నారని.. విలన్ గా ఆమె భర్త, నటుడు సైఫ్ అలీఖాన్ నటించనున్నారని నెట్టింట వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఈమేరకు చర్చలు జరిగాయని సమాచారం. దీనిపై చిత్రబృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. మహేశ్ బాబు కథానాయకుడిగా ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో ఓ యాక్షన్ అడ్వెంచర్ మూవీ పట్టాలెక్కనున్న సంగతి తెలిసిందే. భారీ బడ్జెట్తో ప్రతిష్టాత్మకంగా దీనిని సిద్ధం చేయనున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే ఇది సెట్స్ పైకి వెళ్లనుంది. 'గరుడ' అనే టైటిల్ ప్రచారంలో ఉంది. ఈ చిత్రంలో కరీనాకపూర్ నటించనున్నారని.. ఇప్పటికే చిత్రబృందం ఆమెను సంప్రదించినట్లు వార్తలు వస్తున్నాయి. రాజమౌళి సినిమా కావడంతో కరీనా కూడా వెంటనే ఓకే చెప్పారని టాక్. ఈ వార్తలపై నటి టీమ్ నుంచి ఏ విధమైన స్పందన రాలేదు.





## తారక్ పై పోస్టర్ తో ఆయుధ పూజ సాంగ్‌కి టైం ఫిక్స్




మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ హీరోగా జాన్వీ కపూర్ హీరోయిన్ గా ఆమెతో పాటుగా బాలీవుడ్ స్టార్ నటుడు సైఫ్ అలీఖాన్ టాలీవుడ్ కి పరిచయం అవుతూ దర్శకుడు కొరటాల శివ తెరకెక్కించిన సెన్సేషనల్ ప్రాజెక్ట్ నే "దేవర". మరి ఎన్నో అంచనాలు సెట్ చేసుకున్న ఈ చిత్రం తాలూకా మ్యూజిక్ ఆల్బమ్ కూడా మంచి హిట్ అయ్యింది. అయితే ఈ ఆల్బమ్ లో ఎప్పుడు నుంచో ఊరిస్తున్న క్రేజీ నెంబర్ ఆయుధ పూజపై ఫైనల్ గా మేకర్స్ అప్డేట్ ఇచ్చేసారు. మరి ఈ సాంగ్ ని రేపు సెప్టెంబర్ 19న ఉదయం 11 గంటల 7 నిమిషాలకి రిలీజ్ చేస్తున్నట్టుగా తారక్ పై ఇంటెన్స్ లుక్ లో చూస్తున్న పోస్టర్ తో క్లారిటీ ఇచ్చారు. దీనితో ఈ సాంగ్ కోసం ఇపుడు అభిమానులు ఎదురు చూస్తున్నారు. మరి ఈ సాంగ్ ని అనిరుద్ ఏ లెవెల్లో అందించాడో అనేది వేచి చూడాలి. ఇక ఈ చిత్రానికి ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ వారు సంయుక్తంగా నిర్మాణం వహించగా ఈ సెప్టెంబర్ 27న ప్రపంచ వ్యాప్తంగా "దేవర" భారీ రిలీజ్ కాబోతుంది.

## 1 మిలియన్ దిశగా "మత్తు వదలరా 2".. యూఎస్‌లో లేటెస్ట్ వసూళ్లు

లేటెస్ట్ గా మన టాలీవుడ్ సినిమా దగ్గర రిలీజ్ కి వచ్చి మంచి హిట్ గా నిలిచిన చిత్రాల్లో క్రేజీ కామెడి థ్రిల్లర్ చిత్రం "మత్తు వదలరా 2" కూడా ఒకటి. టాలెంటెడ్ యంగ్ హీరో శ్రీసింహా హీరోగా కమెడియన్ సత్య హిలేరియస్ రోల్ లో దర్శకుడు రితేష్ రానా తెరకెక్కించిన ఈ చిత్రం మొదటి పార్ట్ తరహాలోనే మంచి హిట్‌గా నిలిచింది. అయితే ఈ చిత్రం మొదటి రోజు నుంచే వరల్డ్ వైడ్ గా మంచి వసూళ్లు రాబడుతుండగా యూఎస్ మార్కెట్ లో కూడా ఈ చిత్రం అదిరే వసూళ్లు నమోదు చేస్తుంది. వీక్ డేస్ లోకి వచ్చినప్పటికీ కూడా స్ట్రాంగ్ హోల్డ్ ని కనబరుస్తూ అదరగొడుతుంది. ఇలా ఈ చిత్రం యూఎస్ లో 8 లక్షల డాలర్స్ గ్రాస్ మార్క్ ని అందుకొని 1 మిలియన్ క్లబ్ లో జాయిన్ అయ్యే దిశగా దూసుకెళ్తుంది. ఇక ఈ చిత్రానికి కాల భైరవ సంగీతం అందించగా మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణం వహించిన సంగతి తెలిసిందే.






## ధోనీని ఔట్ చేసిన ఆఖరి వ్యక్తిగా మిగిలిపోతానేమో!: యశ్ దయాల్

**ఆర్సీబీ, సీఎస్కేల మధ్య జరిగిన మ్యాచ్లో ధోనీని ఔట్ చేయడం తనకు ఎంతో బాధ కలిగించిందని యువ పేసర్ యశ్ దయాల్ తెలిపాడు.**



ఇంటర్నెట్ డెస్క్: భారత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ సుదీర్ఘ ఫార్మాట్కి వీడ్కోలు పలికినప్పటికీ ఐపీఎల్లో ఆడుతున్న విషయం తెలిసిందే. అతడి ఆటను చూడటానికి అభిమానులు ఎంతగానో ఆసక్తి కనబరుస్తుంటారు. అయితే ఇకపై ధోనీ ఐపీఎల్లోనూ ఆడడనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో భారత పేసర్ యశ్ దయాల్ ఓ విషయాన్ని గుర్తు చేసుకున్నాడు. ఆర్సీబీకి ప్రాతినిధ్యం వహించిన దయాల్ సీఎస్కేతో మ్యాచ్లో ధోనీని ఔట్ చేయడం తనకు ఎంతో బాధ కలిగించిందని తెలిపాడు. 'సీఎస్కే ప్లేఆఫ్స్కు వెళ్లాలంటే ఒక ఓవర్లో 17 పరుగులు అవసరం ఉంది. క్రీజ్లో ధోనీ ఉన్నప్పుడు వారికి అదేమీ పెద్ద విషయం కాదు. 2023 ఐపీఎల్లో రింకు సింగ్కు బలైనప్పటికీ.. నాపై నమ్మకంతో బౌలింగ్ కి పంపాడు ఆర్సీబీ కెప్టెన్ డూప్లిసిస్. ఓవర్లో తొలి బంతికే ధోనీ సిక్స్ బాదడంతో సమీకరణం ఐదు బంతుల్లో 11 పరుగులకి తగ్గింది. అయితే ధోనీ వికెట్ కోసం విరాట్ కోహ్లి అప్పటికే వ్యూహం రచించాడు. మొదట యార్కర్ వేయాలనుకుని ఆ తర్వాత స్లో బౌల్ వేసి ధోనీని ఓట్ చేశా. ధోనీ ఇప్పుడు డగౌట్ లోకి వెళ్తే మళ్లీ వస్తాడన్న నమ్మకం లేదు. ధోనీ అభిమానులు నన్ను ఎంతగా తిట్టుకుంటారో అన్న విషయాన్ని నేను పట్టించుకోలేదు. కానీ నిరాశతో మైదానాన్ని విడిచివెళ్తున్న ధోనీ మళ్లీ వస్తాడా, లేదా? ధోనీని ఔట్ చేసిన ఆఖరి వ్యక్తిగా మిగిలిపోతానా? ఇలాంటి ఆలోచనలన్నీ నా మెదడులో తిరుగుతున్నాయి. అందులోనూ ఆశించిన ముగింపు లేకపోవడంతో ధోనీ మైదానాన్ని వీడి డగౌట్ లో నిరాశగా కూర్చోవడం నాకు చాలా బాధ కలిగించింది' అంటూ ఐపీఎల్ నాటి రోజులను గుర్తు చేసుకున్నాడు యశ్. కాగా.. నాలుగు బంతుల్లో 11 పరుగులను డిఫెండ్ చేయాల్సిఉండగా ఒక్క పరుగు మాత్రమే ఇచ్చి ఆర్సీబీని ప్లేఆఫ్స్ లోకి తీసుకెళ్లాడు యశ్. ఇదిలాఉండగా, సెప్టెంబర్ 19 నుంచి చిదంబరం వేదికగా జరిగే భారత్-బంగ్లా తొలి టెస్ట్ సిరీస్ కి యశ్ దయాల్ ఎంపికైన విషయం తెలిసిందే.

## ఫ్యాషన్


# ఈ కలర్ లెగ్గింగ్స్ అస్సలు వేయొద్దోట

లెగ్గింగ్స్ ఆడవారు ఎక్కువగా వేసుకుంటుంటారు. అయితే, వీటిని వేసుకునేటప్పుడు కొన్ని మిస్టేక్స్ చేస్తుంటారు. అవేంటో తెలుసుకోండి. చుడిదార్, పంజాబీ.. ఇలాంటి వాటిమీదకి లేడీస్ ఎక్కువగా లెగ్గింగ్స్ వేస్తుంటారు. అయితే, వీటిని వేసుకునేటప్పుడు కొన్ని ఫ్యాషన్ మిస్టేక్స్ అవాయిడ్ చేయాలి. అవేంటో తెలుసుకుని పర్ఫెక్ట్ లెగ్గింగ్ స్టైల్ ఎలా చేయాలో తెలుసుకోండి.




### సేమ్ కలర్ వద్దు..

టాప్ ఏ కలర్‌లో ఉంటుందో అదే కలర్ లెగ్గింగ్ వేసుకోవడం కూడా కరెక్ట్ కాదని చెబుతున్నారు నిపుణులు. ఎక్స్‌పర్ట్స్ ప్రకారం కాంట్రాస్ట్ కలర్స్ వేయడం వల్ల లుక్ ఎలివేట్ అవుతుందని చెబుతున్నారు. అలానే, ఒకటి కంటే ఎక్కువ కలర్స్ ఉన్న లెగ్గింగ్స్ వేయొద్దు. మరీ ముఖ్యంగా ప్లెయిన్ టాప్ పైకి వీటిని వేసుకుంటే చూడ్డానికి అంతగా బాగోవు. కాబట్టి ఇలాంటి ఫ్యాషన్ మిస్టేక్స్ చేయొద్దు.






### మోకాళ్ళ వరకూ ఉండడం..

నేటి ఫ్యాషన్ ట్రెండ్స్‌లో యాంకిల్ కట్ లెగ్గింగ్స్ అని వేసుకుంటున్నారు. ఎక్స్‌పర్ట్స్ ప్రకారం, మొత్తం కాలుని కవర్ చేసే లెగ్గింగ్స్ వేస్తేనే లుక్ బావుంటుంది. యాంకిల్ కట్ అనేవి కూడా కాళ్ళు కవర్ అయ్యేలా చూడాలని చెబుతున్నారు. అలా అని మరీ పొడువుగా ఉండేవి కూడా వద్దు. ఎక్కువగా పొడుగ్గా లేనివి, అలా అని పొట్టిగా ఉండేవి కాని వాటిని ఎంచుకోండి.

### మరీ లూజ్..

మరీ లూజ్ టాప్ వేసుకుని లెగ్గింగ్స్ వేసుకుంటే ఆ లుక్ ఎబ్బెట్టుగా ఉంటుంది. మరీ టైట్‌గా ఉండొద్దు. అలా అని మరీ లూజ్‌గా ఉండొద్దు. నార్మల్ కుర్తీలపైకి లెగ్గింగ్స్ వేసుకోవాలని గుర్తుపెట్టుకోండి.



### షార్ట్ టాప్..

షార్ట్ టాప్ వేసుకుని వాటిపైకి లెగ్గింగ్ వేసుకోవడం కూడా సరికాదని చెబుతున్నారు ఫ్యాషన్ ఎక్స్‌పర్ట్స్. మోకాళ్ళని కవర్ చేసే టాప్స్, కుర్తాలపైకి లెగ్గింగ్స్ వేసుకుంటేనే అవి చూడ్డానికి అందంగా కనిపిస్తాయని చెబుతున్నారు.

### స్కిన్ కలర్ లెగ్గింగ్స్..

చాలా మంది ఆడవారు స్కిన్ కలర్ లెగ్గింగ్స్ వేస్తుంటారు. కానీ, ఫ్యాషన్ ఎక్స్‌పర్ట్స్ ప్రకారం ఇది చాలా రాంగ్ సెలక్షన్. అలా వేసుకోవడం కరెక్ట్ కాదని చెబుతున్నారు.

